క్లుప్తంగా

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళగిరికి చెందిన శ్రీశైలజ నృత్య కళానిలయానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ధర్మపథం వేదికపై శనివారం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నృత్య ప్రదర్శన జరిగింది. చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందించారు.

అర్బన్ మార్కెట్‌ను ఆదరించండి

పటమట(విజయవాడతూర్పు): మహిళలు ఆర్థికంగా ఉన్నతంగా మారేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వీఎంసీ పట్టణ సాధికార విభాగం(అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్) ఇన్‌చార్జి ప్రాజెక్ట్ అధికారి(పీవో) డాక్టర్ లత అన్నారు. శనివారం వీఎంసీ, మెప్మా ఆధ్వర్యంలో జింఖానా గ్రౌండ్స్‌లో, పటమట రైతుబజార్ వద్ద అర్బన్ మార్కెట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు రూపొందించిన వస్తువులు, ఉత్పత్తుల ప్రదర్శన అమ్మకానికి మెప్మా మార్కెట్ కృషి చేస్తుందని, ఇక్కడ వివిధ రకాల వస్తువులు అందుబాటులో ఉన్నాయని, నగరవాసులు స్వయం సహాయక సంఘాల మహిళలను ప్రోత్సాహించాలని ఆమె కోరారు.

రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విధి నిర్వహణలో ఉంటూ రోడ్డు ప్రమాదంలో మరణించిన శానిటేషన్ వర్కర్ ధారా ప్రశాంత్ కుటుంబానికి రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నగర ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శనివారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో చనుమోలు వెంకట్రావు ఫ్లై ఓవర్ దిగువన పాలఫ్యాక్టరీ ఏరియాలో పారిశుద్ధ్య పనులు నిర్వర్తిస్తున్న ఆప్కాస్ కాంట్రాక్ట్ కార్మికుడు ధారా ప్రశాంత్‌ను వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టడంతో మరణించాడని ఆయన వివరించారు. ఫ్లై ఓవర్లపైన, ప్రధాన రోడ్లపై విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు మున్సిపల్ శాఖ అధికారులు సరైన రక్షణ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. నెలలోనే ఒక మహిళ మరణించిందని, ముగ్గురు వర్కర్లు గాయపడ్డారని తెలిపారు.

లారీ ఢీకొని పారిశుద్ధ్య కార్మికుడి మృతి

పాలప్రాజెక్టు ఫ్లై ఓవర్‌పై ఘటన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు ఫ్లై ఓవర్‌పై విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడిని లారీ ఢీ కొట్టడంతో మృతి చెందిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సేకరించిన వివరాల ప్రకారం ధారా ప్రశాంత్(30) కార్పొరేషన్ ప్రజారోగ్య శాఖలో కాంట్రాక్ట్ కార్మికుడు. టీనర్ పేటలో నివసిస్తున్న ప్రశాంత్‌కు భార్య పండు, ముగ్గురు సంతానం ఉన్నారు. శనివారం పాలప్రాజెక్టు ఫ్లై ఓవర్‌పై రోడ్డును శుభ్రం చేస్తుండగా, వెనుక నుంచి వచ్చిన లారీ అతన్ని ఢీ కొట్టింది. తీవ్రగాయాలైన ప్రశాంత్‌ను తోటి కార్మికులు హుటాహుటిన ఆటోలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రశాంత్ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై సమాచారం అందుకున్న కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

- ప్రశాంత్ రోడ్డు ప్రమాద ఘటన తెలుసుకున్న సీఐటీయూ నేతలు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్పొరేటర్ బోయి సత్యబాబు, సీఐటీయూ నేతలు జ్యోతిబస్, సాములు ఉన్నారు.

ఆహ్లాదం.. ఆమడ దూరం

- అధ్వానంగా లేబర్‌కాలనీ పార్క్–1
- ప్రమాదకరంగా వాటర్ సంప్
- పార్క్–2లో పాడైపోయిన పిల్లల ఆటపరికరాలు
- పట్టించుకోని వీఎంసీ పార్క్‌ల అధికారులు



పచ్చదనం కానరాని పార్క్–1 ప్రాంగణం

భవానీపురం(విజమవాడపశ్చిమ): వీఎంసీ పార్కుల్లో ఆహ్లాదం ఆమడదూరంగా ఉంది. గతంలో ఇవి ఏర్పాటుచేసినప్పుడు సందర్శకుల సంఖ్య బాగానే ఉన్నా తర్వాత నిర్వహణలోపంతో పార్కులు నిర్లక్ష్యానికి మార్కుగా కనిపిస్తున్నాయి. 'పశ్చిమ'లో గట్టు వెనుక ప్రాంతంలోని విద్యాధరపురం లేబర్‌కాలనీలో దాదాపు 500 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరిలో ఎక్కువ భాగం విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు. వీరి కోసం నగరపాలక సంస్థ రెండు ఉద్యానవనాలను (పార్క్‌- 1, పార్క్ -2) ఏర్పాటు చేసింది. ఇందులో పార్క్–1లో అయితే ఉద్యాన ఛాయలే లేవు. గ్రీనరీతోకూడిన పచ్చదనం లేదు. చెట్లు/మొక్కలు అసలే లేవు.

పార్కులంటారా!

పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు లేవు. ఏ కోణంలో చూసినా దాన్ని పార్క్ అని పిలిచే అవకాశాలు కనుచూపు మేర లేవు. కేవలం ఖాళీ స్థలంతో ఎంత అధ్వానంగా ఉండాలో అంత ఉంది. పార్క్ అనే ఈ స్థలం చుట్టూ ఉన్న ప్రహరీ కేవలం మూడు అడుగులలోపు ఎత్తులో ఉంది. ప్రహరీలో అక్కడక్కడా సగానికిపైగా విరిగిపోయి ఉండటంతో చిన్న పిల్లలు సైతం లోపలకు వచ్చేయవచ్చు. గేట్లు అసలు లేనే లేవు. దీంతో పశువులు లోనికి వచ్చి శుభ్రంగా పడుకోవడంతోపాటు అవి వేసే పేడ కుప్పలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఇక ఈ పార్క్ ప్రహరీ బయట ఉన్న వృక్షాల కొమ్మలు విరిగి ఆవరణ లోపల పడి కుప్పలుగా తయారయ్యాయి. పార్క్–1 అనే ఈ స్థలానికి నాలుగు వైపులా ఉన్న చిన్నపాటి రోడ్ల పక్కన అనేక నివాసాలు ఉన్నాయి. అధ్వానంగా ఉన్న పార్క్ లోపల నుంచి వచ్చే దుర్వాసన భరించలేక పోతున్నామని స్థానికులు చెబుతున్నారు.

ప్రమాదకరంగా పార్క్‌లో వాటర్ సంప్

పార్క్–1 స్థలంలో ఉన్న మూత లేని నీటి సంప్ ప్రమాదకరంగా ఉంది. ఇందులో వర్షం నీరు రోజుల తరబడి నిలిచి దుర్వాసన వస్తోంది. రోడ్డుకు ఆనుకుని ఉన్న పార్క్ ప్రహరీ సరిగ్గా సంప్ పక్కనే పడటంతో అక్కడ ఖాళీ ఏర్పడింది. ఇళ్ల ముందు ఆడుకునే చిన్న పిల్లలు తమ ఆట వస్తువులు పార్క్ లోపల పడితే తెచ్చుకునేందుకు లోపలకు దూకుతారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు మూత లేని నీటి సంప్‌లో పడిపోతే ఎవరైనా చూస్తే తప్ప వారు కనబడని పరిస్థితి నెలకొంది. పార్క్ లోపల ఖాళీ స్థలం



మూత లేక ప్రమాదకరంగా ఉన్న నీటి సంప్

ఎలా ఉన్నా చుట్టూ ప్రహరీ అయినా కనీసం ఆరు అడుగుల ఎత్తులో నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడితే పరిస్థితి ఇలాగే ఉంటుందని వాపోతున్నారు.

పార్క్–2లో పాడైన ఆట పరికరాలు



లేబర్ కాలనీలో పార్క్–2 బయట నుంచి చూసేవారికి బాగానే కనిపించినా లోపల గ్రీనరీ అంతంత మాత్రంగానే ఉంటుంది. ఇక్కడ వాకింగ్ ట్రాక్‌కూడా ఉంది. పిల్లల ఆట పరికరాల్లో కొన్ని పాడైపోవడంతో వాటిని పక్కన పడేశారు. పిల్లలు ఊగే రెండు ఉయ్యాలల్లో ఒకటి విరిగిపోయింది. గతంలో ఈ పార్క్ నిర్వహణకు కమిటీ ఉండేది. తర్వాత రద్దు కావడంతో దాని బాగోగులు పట్టించుకున్న నాథుడు లేడు. కాలనీల్లో పార్క్‌లు ఏర్పాటు చేయగానే సరి కాదని, వాటి నిర్వహణను పట్టించుకోవల్సిన బాధ్యత ఏర్పాటు చేసిన వారిదేనని కాలనీవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



విరిగిన ప్రహరీ



ఎండిపోయిన చెట్ల కొమ్మలతో అధ్వానంగా

జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసకుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సమాజ హితం కోసం పని చేస్తున్న జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు ఒక్కొక్కరికి మూడు సెంట్ల స్థలాన్ని కేటాయిస్తూ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమన్వయంతో పనిచేయండి

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక విభాగంలో విధులు నిర్వహించే అధికారులు సమన్వయంతో పని చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. శనివారం ఆయా విభాగాల శాఖాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖాధిపతులతో ఆయన మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో ప్రతిరోజూ డివిజన్లలో సంయుక్త పరిశీలన చేయాలన్నారు. పట్టణ ప్రణాళిక, శానిటరీ, ఎమినిటీస్ సెక్రటరీలు పరిశీలించాలన్నారు.

జీతో నూతన కార్యవర్గాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జైన్ సంఘాలకు చెందిన జీతో (జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) విజయవాడ చాప్టర్ ప్రధాన, యువజన, మహిళా విభాగాల నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారోత్సవం ఇటీవల ఘనంగా జరిగిందని ఆ సంఘ ప్రధాన విభాగ అధ్యక్షులు కమలేష్ పోలాముతా తెలిపారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా కమలేష్ పోలాముతా, ఉపాధ్యక్షులు దినేష్‌జైన్, రాకేష్‌జైన్, ముఖ్య కార్యదర్శి మనీష్‌జైన్, కార్యదర్శులు ప్రవీణ్‌రాంకా, మనీష్‌మంగీలాల్‌జైన్, కోశాధికారి కుందనమల్ గాంధీ ప్రమాణ స్వీకారం చేశారని పేర్కొన్నారు. అలాగే యువజన విభాగానికి సంబంధించి విజయవాడ చాప్టర్ అధ్యక్షుడిగా రిషభ్‌జైన్, ఉపాధ్యక్షులుగా యాష్‌జైన్, రోనిష్‌జైన్, ముఖ్య కార్యదర్శిగా నిషా బగ్రెచా, కార్యదర్శులుగా గౌవర్‌సాలేచా, ఖుషికుద్, కోశాధికారిగా యమూర్‌గాంధీ ఎన్నికయ్యారని పేర్కొన్నారు. మహిళా విభాగానికి సంబంధించి అధ్యక్షురాలిగా కాజల్‌జైన్ ప్రమాణస్వీకారం చేశారు.

శానిటరీ సిబ్బంది సేవలు స్ఫూర్తిదాయకం

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి



శానిటరీ సూపర్‌వైజర్ శివరామ్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న భాగ్యలక్ష్మి. చిత్రంలో వెలంపల్లి, డాక్టర్ శ్రావణ్ కుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): కోవిడ్, బుడమేరు వరద వంటి విపత్తుల్లో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా నిలిచిన పారిశుద్ధ్య కార్మికులు, శానిటరీ సిబ్బంది విశేష సేవలు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, పశ్చిమ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వైద్య సేవలో 13 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రజా వైద్యశాల డాక్టర్ శ్రావణ్ కుమార్ చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోని ఒక ఫంక్షన్ హాల్‌లో శనివారం బుడమేరు ఫ్రంట్‌లైన్ వారియర్స్ పేరుతో పలువురు శానిటరీ సిబ్బందిని సత్కరించి ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కోవిడ్ కాలంలోను, బుడమేరు వరదల్లో ముందుండి బాధితులకు సేవలు అందించిన పారిశుద్ధ్య సిబ్బంది అభినందనీయులని కొనియాడారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మున్నెన్నడూ లేని విధంగా ముంచుకొచ్చిన బుడమేరు వరదల్లో పేదలు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావని పేర్కొన్నారు. డాక్టర్ శ్రావణ్ కుమార్ అందించిన సేవలు అభినందనయమన్నారు. సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు మాట్లాడుతూ నగరంలో 32 డివిజన్లు జలదిగ్బంధంలో చిక్కుకు పోయాయని, ప్రభుత్వం ముందు జాగ్రత్తలు తీసుకుంటే ప్రజలు ఇంతగా నష్టపోయేవారు కాదని చెప్పారు. కొత్తపేట సీఐ కొండలరావు మాట్లాడుతూ 'దైవం మానుష రూపేణ' అన్న చందంగా అనేక స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి వరద బాధితులకు సాయం చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత పోతిన వెంకట మహేష్, అమరావతి జేఏసీ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, కూటమి నాయకులు ఎంఎస్ బేగ్, అడ్డూరి శ్రీరామ్, బాడిత శంకర్ తదితరులు పాల్గొన్నారు. తొలుత చిన్నారుల భరత నాట్యం ఆహూతులను అలరించింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రామరాజ్యనగర్ సెక్షన్ 33/11 కేవీ కబేళా విద్యుత్ సబ్‌స్టేషన్‌తోపాటు దాని పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కబేళా, ఊర్మిళానగర్, జోజినగర్, సితార సెంటర్, రాము క్వారీ సెంటర్, పోలీస్ కాలనీ, లలితానగర్, విద్యాధరపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్, లేబర్ కాలనీ, కోట నాగేశ్వరరావు వీధి ప్రాంతాల్లో కరెంట్ నిలిపి వేయనున్నట్లు ఆయన వివరించారు.

'కోపా' స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న డాక్టర్ కైలాసరావు తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కులమతాలకు అతీతంగా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించేందుకు కాపు అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(కోపా) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోపా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ దావులూరి కైలాసరావు, డి.రమేష్ కుమార్ తెలిపారు. విజయవాడ ముత్యాలంపాడులో శనివారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కోపా గత 27 ఏళ్లుగా ఉమ్మడి కృష్ణా జిల్లాలకు చెందిన మెరిట్ విద్యార్థులను గుర్తించి ఏటా ఉపకార వేతనాలు అందజేసి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. తమ వద్ద ప్రోత్సహకాలు అందుకున్న విద్యార్థులే దాతలుగా మారి కోపాకు సహకరించటం సంతోషంగా ఉందన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడిసిన్, డిప్లమో తదితర కోర్సులు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు kopakrishnavja@gmail.com కు అభ్యర్థన పంపితే దరఖాస్తు పంపిస్తామని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులకు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు జత చేసి వచ్చే నెల 20వ తేదీలోపు పంపించాలని సూచించారు. మరింత సమాచారంకోసం 94402 39989, 70936 39919 నంబర్లు, ఈ మెయిల్ ఐడీల ద్వారా సంప్రదించాల్సిందిగా వారు కోరారు. సమావేశంలో కోపా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి సంజీవ్, కోశాధికారి గాజుల రామారావు, ఎక్స్ అఫీషియో సభ్యులు కొప్పరాతి వెంకట రమణారావు, రామాయణం నాగసత్యం, గల్లా భాస్కర్ రావు, బెల్లం సత్యనారాయణ, పులుగుజ్జు ప్రసాద్, బీవీ సుధాకర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా కలర్ కార్నివాల్ డే



కలర్ కార్నివాల్ డే వేడుకల్లో చిన్నారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక క్రాంబ్వే రోడ్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో శనివారం నిర్వహించిన కలర్ కార్నివాల్ డే వేడుకల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రీ ప్రైమరీ చిన్నారులు ఇంద్రధనస్సు రంగుల దుస్తులు ధరించి కనువిందు చేశారు. పాఠశాల ఆవరణను సప్త వర్ణాలతో అలంకరించడంతో ఇంద్రధనస్సును మరిపించింది. ముఖ్యఅతిథులుగా పాఠశాల ప్రెసిడెంట్ టి.మోనిక సుమన్, సెక్రటరీ/కరస్పాండెంట్ టీ సుమన్ త్యాగరాజ్ హాజరై చిన్నారులను అభినందించారు. వారు మాట్లాడుతూ హరివిల్లులోని ప్రతి వర్ణం తనదైన ప్రత్యేకతతో నిండి నమ్మకం, ప్రేరణ, ఉత్సాహం, సంతోషం వంటి సామాజిక సానుకూల దృక్పథాలను కలిగిస్తాయని వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ప్రిన్సిపాల్ కేవీ కల్యాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భవిష్యత్ మార్పులను అనుసరించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుబ్బారావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు భవిష్యత్‌లో ఎదురయ్యే మార్పులను అనుసరించినప్పుడే అభివృద్ధిని సాధిస్తారని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రొఫెసర్ బీవీ సుబ్బారావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్నో మైండ్స్ క్లబ్ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం ఆ కళాశాల ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుబ్బారావు మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో చాలా వేగవంతమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాటిని విద్యార్థులు గమనించి పట్టు సాధించాలని సూచించారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు రాణించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఐటీ ప్రముఖుడు బి.రాజేష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, విభాగాధిపతి డాక్టర్ షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలకు పదును పెడితేనే విజయావకాశాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమలోని నైపుణ్యాలకు పదును పెడితేనే అద్భుతమైన విజయావకాశాలు లభిస్తాయని హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణ రావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్లేస్‌మెంట్ అండ్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో హెచ్‌ఆర్ కాంక్లేవ్ పేరుతో అవగాహన సదస్సును శనివారం కాలేజీ ప్రాంగణంలో నిర్వహించారు. డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థుల చదువులు పూర్తవ్వకుండానే ఉపాధి అవకాశాలు పొందుతున్నారన్నారు. మంచి అవకాశాలను పొందడానికి ఇంటర్వ్యూల్లో మరింత రాణించడానికి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కంపెనీలు తమ ఉద్యోగుల నుంచి ఏమి ఆశిస్తాయో తెలుసుకొని అలాంటి ప్రతిభాపాటవాలను పెంపొందించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం వారివారి రంగాల్లో రాణించడానికి కళాశాల పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు మాట్లాడుతూ విద్యార్థులు మార్పులను, ఆవిష్కరణలను తెలుసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేష్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్రాఫిక్ పోలీస్ బైక్ విశిష్టతను తెలుపుతున్న పోలీస్



పోలీస్ డాగ్ విన్యాసాలు



పోలీస్ అమరవీరులు సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఓపెన్‌హౌస్‌లో గన్‌లను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు, డీసీపీ గౌతమిశాలి తదితరులు

నగరంలో ఓపెన్ హౌస్

పోలీసు అమరవీరుల సంస్మరణ దినం –2024 వారోత్సవాల్లో భాగంగా శనివారం ఎంజీ రోడ్డు సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. సీపీ రాజశేఖరబాబు, డీసీపీ గౌతమిశాలి గన్‌లను పరిశీలించారు. విద్యార్థులకు గన్ షూట్ చేయడంపై అవగాహన కల్పించారు. ఆయుధాల పనితీరును ఓపెన్‌హౌస్‌కు వచ్చిన విద్యార్థులు పరిశీలించారు. అగ్నిమాపక, సైబర్‌నేరాలు, పోలీస్ డాగ్స్ విన్యాసాలు, ఫింగర్ ప్రింట్స్ తీసుకోవడం తదితర అంశాలను వివరించారు. పోలీస్ డాగ్స్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పోలీస్ కటౌట్ వద్ద విద్యార్థి





గన్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు